క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలని నిరసన



జి.కొండూరు: గడ్డమణుగు లోయ ప్రాంతంలో దశాబ్ధాలుగా నివసిస్తున్న ఒడిశా కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. లోయ ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలతో కలిసి సీపీఎం నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకి వినతి పత్రం అందజేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ లోయ ప్రాంతంలో ప్రధానంగా పాఠశాల ఏర్పాటుతో పాటు తాగునీటి సమస్యకు పరిష్కారం, పక్కాగృహాల ఏర్పాటు, వైద్య శిబిరాల నిర్వహణ, ఆధార్, రేషన్ కార్డులు లేని వారికి వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఎం నాయకులు మహేష్, బాలకృష్ణ, సాంబశివరావు, కోటేశ్వర రావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

రెడ్డిగూడెం(మైలవరం): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలని రెడ్డిగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సందేశ్ అన్నారు. మద్దులపర్వ (అడవి కొత్తూరు) గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ మోడల్ జూనియర్ కళాశాల వసతిగృహం, రాఘవాపురంలోని బీసీ వసతిగృహాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, బాత్రూమ్‌లు, టాయిలెట్‌లను పరిశీలించి హాస్టల్ వార్డెన్‌కు, విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించాలన్నారు. రాఘవాపురం బీసీ హాస్టల్‌లో కిటికీలకు దోమల మెష్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ఎకనామిక్స్, సీఈటీ (ఒకేషనల్) సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్వర్ణలత అన్నారు. నెలకు రూ.10 వేల లోపు గౌరవ వేతనం చెల్లిస్తారని, ఎకనామిక్స్‌కు పీజీలో 50 శాతం మార్కులు వచ్చిన వారు, సివిల్ ఇంజినీరింగ్ టెక్నీషియన్ (సీఈటీ) సబ్జెక్టుకు బీటెక్ సివిల్ ఇంజినీరింగ్‌లో 50 శాతం మార్కులు వచ్చిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 23న సాయంత్రం 4గంటల లోగా కళాశాలలో అందించాలన్నారు. ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు కళాశాల ప్రాంగణంలో మౌఖిక పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

చదువులో బాలికలు ముందుండాలి

రెడ్డిగూడెం(మైలవరం): చదువులో బాలికలు ముందుండాలని రంగాపురం కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపాల్ శ్యామల అన్నారు. రెడ్డిగూడెం మండలం రంగాపురం గ్రామంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులు 37 మందికి సీబీఎస్ఈ అసెస్మెంట్ బేస్ లైన్ ఎగ్జామినేషన్ బుధవారం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు. విద్యాలయంలో జరిగిన ఇంగ్లిష్ పరీక్షను రెడ్డిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ధర్మశీల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ వి. మహేశ్వరి, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ కె. రమేష్‌లు పరిశీలించారు.

వృద్ధులకు సన్మానం



మునునూరు: జీవన మలి సంధ్యలో పలకరింపు, ఆసరా కోసం ఆరాటపడే వృద్ధుల అనుభవాలు మనకు ప్రేరణ, ఆదర్శం కావాలని ప్రేరణాలయ సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ సిస్టర్ సుధారాణి అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రేరణాలయంలో పలువురు వృద్ధులను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ వృద్ధులు తమ జీవితంలో గడించిన అనుభవాలను స్వీకరించాలని, వారిని ఆప్యాయతతో పలకరిస్తూ, నిత్యం ఆదరించాలని సూచించారు.

చాట్రాయిలో ఫాగింగ్

చాట్రాయి: చాట్రాయి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం దోమల నివారణకు గ్రామంలోని అన్ని కాలనీల్లో ఫాగింగ్ చేశారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఫణికుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు దామెర ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్యాడ్లు, పుస్తకాలు పంపిణీ

లింగాల(గంపలగూడెం): లింగాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు 115 మందికి ప్యాడ్లు, పెన్నులు, నోట్ పుస్తకాలను బుధవారం గ్రామస్తుడు కాసర వెంకటరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణం... నరకప్రాయం

నూజివీడు: నూజివీడు పట్టణంలోని పలు రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులకు నరకం కనిపిస్తోంది. గుంతల్లో పడి ఎక్కడ ప్రమాదాల బారిన పడతామోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలోని మైలవరం రోడ్డులో కృష్ణా జలాల పంపుహౌస్ సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై పడిన భారీ గోతులతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో నిరంతరం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

భారీ లోడు వాహనాలతో...

ఇబ్రహీంపట్నం వైపు నుంచి 40 నుంచి 60 టన్నుల లోడుతో భారీ వాహనాలు ఈ మార్గం నుంచే హనుమాన్ జంక్షన్, ఏలూరు ప్రాంతాలకు వెళ్తుంటాయి. పెద్దపెద్ద గోతులు పడటంతో కార్లు, ద్విచక్ర వాహనదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.



నూజివీడు–మైలవరం రోడ్డులో ఆర్‌అండ్‌బీ రహదారిపై పడిన గుంతలు



నూజివీడు–మైలవరం రోడ్డులో నిలిచిన వర్షం నీరు

కార్లకయితే గోతుల్లోకి దిగితే ముందుభాగంలో రేడియేటర్ వద్ద రోడ్డు గుద్దుకొని పైపులు పగులుతున్నాయని యజమానులు వాపోతున్నారు. ట్రిపుల్ ఐటీ వరకు తారురోడ్డు గోతులమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై రోజుల తరబడి నీరు నిలిచి ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

స్పందించాలని వినతి..

విస్సన్నపేట రోడ్డులో పెట్రోలు బంకు వద్ద, హమాలీ వర్కర్స్ అసోసియేషన్ హాలు వద్ద రోడ్డుపై భారీ గుంతలు పడ్డాయి. గుంతల్లో నీరు నిలిచి ఉండటం వల్ల చిన్న గుంతలేనని వేగంగా వెళ్తుండటంతో కార్లు దెబ్బతినడంతో పాటు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చించాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

నేడు జగనన్న కాలనీకి మంత్రి పార్థసారథి రాక

ఇబ్రహీంపట్నం:రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఇబ్రహీంపట్నం రానున్నట్లు పార్టీ వర్గాలు బుధవారం తెలిపాయి. ఇబ్రహీంపట్నం జగనన్న కాలనీని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన సందర్శిస్తారన్నారు. గృహ నిర్మాణాలపై సమీక్ష జరపడంతో పాటు మౌలిక వసతులు, రహదారుల నిర్మాణంపై చర్చిస్తారని పేర్కొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మునునూరు: చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)జిల్లా ప్రోగ్రాం అధికారి డా.నరేంద్ర కృష్ణ అన్నారు. మునునూరులోని జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, బాలికల హాస్టల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీసి భోజనం నాణ్యతను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. హెచ్ఎం సునీల, ఎంపీహెచ్ఈఓ మురళీమోహన్ పాల్గొన్నారు.

భారత్ బంద్ ప్రశాంతం

మైలవరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం భారత్‌బంద్ కార్యక్రమం తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో ప్రశాంతంగా జరిగింది. పలుచోట్ల పాఠశాలలు, వ్యాపార సంస్థలను మూసివేశారు. దళిత నాయకులు ధర్నాలు చేశారు. మానవహారం ఏర్పాటుచేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ దళితుల్లో చిచ్చు పెట్టేందుకే వర్గీకరణ చేస్తున్నారని ధ్వజమెత్తారు. మైలవరంలో జరిగిన బంద్‌లో దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బుర్రి ప్రతాప్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు ఎత్తివేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం తీసుకుందని విమర్శించారు. కేంద్రానికి దమ్ముంటే పార్లమెంట్‌లో రిజర్వేషన్ పెంచే ఆలోచన చేయాలని, అలా కాకుండా ఉన్న రిజర్వేషన్లు విభజించి దళితులను విభజించాలని చూస్తే ఖచ్చితంగా రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత జేఏసీ నాయకులు కోడిరెక్కల ప్రసాదరావు, బొల్లా కిరణ్, గారపాటి నరసయ్య, పిట్టల అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ హారం ఏర్పాటు చేశారు.

- ఆగిరిపల్లి: ఈదరలో దళిత బహుజన పరిరక్షణ సంఘం నాయకుడు జోజి బాబు ఆధ్వర్యంలో పాఠశాలలు, వ్యాపార దుకాణాలను మూసివేయించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన పరిరక్షణ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు.
- నూజివీడు: నూజివీడు పట్టణంలో బంద్ పాక్షికంగా జరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వాటి యజమానులు ముందుగానే సెలవు ప్రకటించారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరగగా, వ్యాపారసంస్థలు, దుకాణాలన్నీ తెరుచుకున్నాయి. బంద్‌లో భాగంగా అంబేడ్కర్ వాదులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆందోళన నిర్వహించారు. నాయకులు చేబత్తిన ముస్నా, హరికోటి ప్రసాద్ పాల్గొన్నారు.



నూజివీడు బస్టాండు వద్ద ఆందోళన



చాట్రాయి సెంటర్‌లో నిరసన



ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో రాస్తారోకో



మైలవరంలో దళిత జేఏసీ నాయకుల మానవహారం

- చాట్రాయి: మండలంలోని పలు గ్రామాల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది. వర్తక వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేశారు. చనుబండ, చాట్రాయిలో రాస్తారోకో నిర్వహించారు. దళిత మహాసభ నాయకులు దారా రాజు, బుర్రి రమేష్, నక్కా రాము తదితరులు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: విస్సన్నపేటలో బంద్ పాక్షికంగా జరిగింది. ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థలు బంద్‌కు సహకరించాయి. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల నాయకులు నినాదాలు చేశారు. విశ్రాంత అధ్యాపకుడు ముంగా జయరాజు, ఎంపీటీసీ మేడా తిరుపతి రావు, దుంగా గంగరాజు, వీర్ల కిరణ్ పాల్గొన్నారు.
- మునునూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు తదితర సంఘాల పిలుపుతో బుధవారం తలపెట్టిన బంద్ మండలంలో పాక్షికంగా కొనసాగింది. గోపవరం నాగేంద్రపురం సెంటర్‌లో సర్పంచ్ కంచర్ల వాణి ఆధ్వర్యంలో యువకులు షాపులను మూయించి, కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేత అజయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎస్పైవాసు ఆధ్వర్యంలో మాల మహానాడు జిల్లా నేత, స్టేట్ హిస్టరీ అకాడమీ మాజీ డైరెక్టర్ స్వరూపరాణితోపాటు, మండల నేతలను వారి, వారి ఇళ్ల వద్దనే నిలువరించారు. దీంతో మండలంలో బంద్ పాక్షికంగా జరిగింది.
- ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో మాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. సుప్రీం కోర్టు తీర్పును పునఃసమీక్షించాలని నినాదాలు చేశారు. కొటికలపూడి సర్పంచి రెంటపల్లి నాగరాజు, ఐక్యవేదిక నాయకులు కుమ్మరి నాగరాజు మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా చేయాలని చూస్తున్న ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐక్యవేదిక నాయకులు అమ్మాజీరావు, పల్లే నరేష్, అనిల్, అభిషేక్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నెమలి(గంపలగూడెం): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని వంట ఏజెన్సీ మహిళలు శుచిగా, శుభ్రంగా తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. నెమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయులు తగిన పర్యవేక్షణ చేసి మధ్యాహ్న భోజనం సరఫరాలో ఏవిధమైన లోపాలు లేకుండా చూడాలని సూచించారు. ఎమ్మెల్యే గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలలో పర్యటించి రోడ్లు, మురుగు కాల్వలను పరిశీలించారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే..

తిరువూరు: స్థానిక ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు నివాసంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి మహిళలు, వృద్ధులు పెన్షన్లు మంజూరు చేయాలని, నివాస గృహాలు, నివేశన స్థలాలు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రాలు సమర్పించారు. గతంలో ప్రతి వారం ఎమ్మెల్యే నిర్వహించే ప్రజాదర్బార్‌లో అధికారులు సైతం పాల్గొని ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించి పరిష్కరిస్తుండగా ప్రస్తుతం ఈ కార్యక్రమం జరగడం లేదు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు

కూనపరాజుపర్వ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. కూనపరాజుపర్వ గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ భవనానికి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాభివృద్ధికి రూ.60 లక్షలు మంజూరు చేశామన్నారు. ఇక్కడ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. కూనపరాజుపర్వ గ్రామంలో విద్యుత్ సమస్య, వివిధ సామాజిక వర్గాల శ్మశాన వాటిక స్థలాల కోసం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. దశలవారీగా రహదారుల నిర్మాణం కూడా పూర్తి చేస్తామని చెప్పారు. మైలవరం నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని, దీనికి సంబంధించి భూములు సిద్ధంగా ఉన్నాయని, ఈ సమస్యను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళతానన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

ముగిసిన స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటు ప్రక్రియ

నూజివీడు: పని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా మండలంలో బుధవారం స్కూల్ అసిస్టెంట్ల పని సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేశారు. ఎంఈఓ–1 ఎం సేవియా, ఎంఈఓ–2 జమలయ్యలు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా ప్రకారం పని సర్దుబాటును నిర్వహించారు. మొత్తం 10 స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్ట్ టీచర్స్ ఖాళీలను పని సర్దుబాటు ద్వారా ఉపాధ్యాయులను నియమించారు. ముక్కొల్లుపాడు యూపీ స్కూల్‌కు చెందిన గణితం ఉపాధ్యాయుడు జి.వెంకటేశ్వరరావును పల్లెర్లమూడి హైస్కూల్‌లోను, ముక్కొల్లుపాడు యూపీ స్కూల్‌కు చెందిన బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయిని మేడా పద్మను నూజివీడు ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లోనూ, ముక్కొల్లుపాడు యూపీ స్కూల్ నుంచి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు పిల్లా జోజప్పను యనమదల హైస్కూల్‌లోనూ, ముక్కొల్లుపాడు యూపీ స్కూల్ నుంచి సోషల్ ఉపాధ్యాయిని తులిమెల్లి శివలక్ష్మిని పట్టణంలోని యానాదుల కాలనీ యూపీ స్కూల్‌లోనూ, గొల్లపల్లి హైస్కూల్ నుంచి సోషల్ ఉపాధ్యాయుడు బి.పుల్లారావును ఆర్‌ఆర్‌పేట యూపీ స్కూల్‌లో నియమించారు. అన్నవరం మెయిన్ స్కూల్ నుంచి సోషల్ ఉపాధ్యాయుడు ఏఎస్‌వీ ప్రసాద్‌ను కొత్త రావిచర్ల యూపీ స్కూల్‌లోను, ఎంపీపీఎస్ లీలీనగర్ నుంచి ఇంగ్లిష్ ఉపాధ్యాయిని మెండు రాజ్యలక్ష్మిని మీర్జాపురం జెడ్పీ హైస్కూల్‌లోను, మీర్జాపురం దళితవాడ స్కూల్ నుంచి సోషల్ ఉపాధ్యాయిని కలపాల సీతారామమ్మను పల్లెర్లమూడి జెడ్పీ హైస్కూల్‌లోనూ, ఎంపీయూపీ సీతారామపురం నుంచి హిందీ ఉపాధ్యాయిని కె.కుమారిని అన్నవరం జెడ్పీ హైస్కూల్‌లోను, గొల్లపల్లి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు జుజ్జువరపు రంగారావును పట్టణంలోని కోటవారిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో నియమించారు.

మహిళలకు రక్షణ కల్పించాలని నిరసనలు

తిరువూరు: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచార ఘటనను నిరసిస్తూ తిరువూరులో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు ధర్నా నిర్వహించారు. మహిళలపై అత్యాచారాలు, హత్యా ఘటనలు నిత్యం జరుగుతున్నాయని, మహిళా సంరక్షణకు చట్టాలు ఉన్నా ప్రయోజనం లేదని సీఐటీయూ నాయకుడు మేకల నాగేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. కళాశాలలు, పాఠశాలల వద్ద విద్యార్థినులకు రక్షణ కల్పించాలని, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో మానవహారం

- విస్సన్నపేట: సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నాగరాజు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీహెచ్ సూర్యనారాయణ, కేవీపీఎస్ జిల్లా నాయకుడు మేకల జ్ఞానరత్నం, ఐద్వా నాయకులు రంగారాణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో ధర్నా చేస్తున్న నాయకులు



విస్సన్నపేటలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీల మానవహారం

దోషులను కఠినంగా శిక్షించాలి..

మైలవరం: మైలవరంలో సీఐటీయూ కార్యాలయం నుంచి బోసు బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ దుండగులను బహిరంగంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు ప్రత్తిపాటి జ్యోతి, ఆర్వీ పుష్పకుమారి, బాయమ్మ, నాగమణి, వెంకమ్మ పాల్గొన్నారు.

- నూజివీడు: పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నూజివీడు పట్టణ నాయకులు ఎన్ఆర్ హనుమాన్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించే విషయంలో పూర్తిగా విఫలమవుతున్నాయని ధ్వజమెత్తారు. సీఐటీయూ జిల్లా నాయకుడు జి.రాజు, నాయకులు ఎస్.పద్మాంజలి, పుట్టి కమల, రామకూరి మరియదాసు, శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ‘ఉపాధి’ గ్రామ సభలు

ఇబ్రహీంపట్నం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనుల గుర్తింపునకు మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఒకే రోజు గ్రామ సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ రామకృష్ణా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభల నిర్వహణకు అధికారులను నియమించామన్నారు. 23న దాములూరు, చిలుకూరు, కాచవరం, కేతనకొండ, కొటికలపూడి, మూలపాడు, జూపూడి, తుమ్మలపాలెం, ఈలప్రోలు, గుంటుపల్లి గ్రామాల్లోని గ్రామ సచివాలయాల వద్ద ఉదయం నుంచి గ్రామ సభలు జరుగుతాయని చెప్పారు. ఈ సభల్లో 2024–25 ఏడాదికి గ్రామాల్లో చేపట్టనున్న పనులను గుర్తించి గ్రామ సభలో ఆమోదిస్తారని వివరించారు.

- ఆగిరిపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శంకరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహిస్తారని, రైతులు, కూలీలు, గ్రామ సభలలో పాల్గొని ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం గుర్తించిన పనులు కాకుండా రైతులకు ఏమైనా పనులు అవసరమైతే గ్రామ సభలో తెలపాలని కోరారు.

చిత్రలేఖనం, కాలీగ్రఫీలో పూజితప్రియ ప్రతిభ



పూజిత ప్రియ వేసిన పెయింటింగ్



రాష్ట్ర స్థాయి హ్యాండ్‌రైటింగ్ అవార్డు అందుకున్న పూజిత ప్రియ

వరించిన జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నానికి చెందిన డిగ్రీ విద్యార్థిని ఏర్ల పూజితప్రియ చిత్రలేఖనం, కాలీగ్రఫీ (చేతిరాత)లో ప్రతిభ చూపుతోంది. చదువుకుంటూనే ఖాళీ సమయాల్లో బొమ్మలు గీయడం అలవాటుగా మార్చుకుంది. చిత్రలేఖనం, చేతిరాతపై కుమార్తెకు ఉన్న ఇష్టాన్ని గుర్తించిన తల్లిదండ్రులు పెయింటింగ్, కాలీగ్రఫీలో శిక్షణ ఇప్పించి ప్రోత్సహించారు.డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతూ వివిధ పోటీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు ఆమె సొంతం చేసుకుంది.

సమ్మయ్య మాస్టారు వద్ద శిక్షణ

కాలీగ్రఫీ ఉపాధ్యాయుడు జి.సమ్మయ్య మాస్టారు వద్ద పూజితప్రియ శిక్షణ పొంది ప్రావీణ్యం సంపాదించింది. చిత్రలేఖనంలో ఊహలకు ప్రతిరూపంగా గ్రామీణ నేపథ్యం కలిగిన ప్రకృతి అందాలతో వేసిన పెయింటింగ్స్ పలువురి మన్ననలు పొందాయి. స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లినప్పుడు పెన్సిల్‌తో బొమ్మలు గీసి బహుమతిగా ఇస్తూ వారి మన్ననలు పొందుతోంది. పలువురు విద్యార్థులు సైతం వారి ప్రాజెక్ట్ వర్క్ నిమిత్తం ఈమె వద్దకు వచ్చి బొమ్మలు వేయించుకుంటారు. చిత్రలేఖనం ఒత్తిడిని దూరం చేస్తుందని, అది చదువుకు ఎంతగానో ఉపయోగపడుతుందని పూజితప్రియ తెలిపింది.

జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు

చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్ పోటీల్లో ఏర్ల పూజిత ప్రియ వివిధ అవార్డులు, ప్రశంసాపత్రాలు పొందింది. ఆల్ ఇండియా హ్యాండ్ రైటర్స్ అసోసియేషన్ వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బెస్ట్ హ్యాండ్‌రైటింగ్ అవార్డు సాధించింది. అవార్డుతో పాటు ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందుకుంది. ఎన్టీటీపీఎస్ సంస్థ నిర్వహించిన రహదారి భద్రత డ్రాయింగ్ పోటీల్లో పాల్గొని జిల్లా అవార్డు, ప్రశంసాపత్రం సాధించింది. ఇవికాక పాఠశాల, కళాశాల స్థాయిల్లో అనేక ప్రశంసా పత్రాలు పొందింది.

గురువును మించిన శిష్యురాలు

> ఏర్ల పూజిత ప్రియ చెప్పిన విషయాలు తక్షణం గ్రహిస్తుంది. శిక్షణలో చెప్పిన అంశాలపై పట్టు సాధిస్తుంది. చదువుతో పాటు చిత్రలేఖనం, చేతిరాత అంశాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు పొందడం గొప్ప విషయం. కాలీగ్రఫీలో గురువును మించిన శిష్యురాలిగా ఎదుగుతుందనే నమ్మకం నాకు కలిగింది.
>
> – జి.సమ్మయ్య, కాలీగ్రఫీ మాస్టారు, కొండపల్లి

సీపీఎం నాయకుల పర్యటన

ఎ.కొండూరు: మండలంలోని కోమటికుంట, లక్ష్మీపురం, రామచంద్రాపురం, గొల్లమందల తండా, రేపూడి గ్రామాల్లో బుధవారం సీపీఎం నాయకులు పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ మాట్లాడుతూ గ్రామాలకు కృష్ణా జలాలు సరఫరా చేయాలని, డయాలసిస్ చేయించుకుంటున్న వారి కుటుంబాలను ఆదుకోవాలని, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రతి గ్రామంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాలను నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం నాయకులు కోట కల్యాణ్, జట్టి వెంకటేశ్వరరావు, పి. ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐ చంద్రశేఖర్ బాధ్యతల స్వీకారం



మైలవరం: మైలవరం సీఐగా దాడి చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడ సీఐడీ విభాగంలో ఇప్పటివరకు పని చేసి బదిలీపై మైలవరం వచ్చారు. ఇప్పటివరకు సీఐగా బాధ్యతలు నిర్వహించిన మురళీమోహన్ బదిలీపై వెళ్లారు.

జి.కొండూరు ఎస్ఐగా సతీష్‌కుమార్



జి.కొండూరు: జి. కొండూరు ఎస్ఐగా కె. సతీష్‌కుమార్ బుధవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన షబ్బీర్ అహ్మద్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సతీష్‌కుమార్ నియమితులయ్యారు. స్టేషన్ సిబ్బంది నూతన ఎస్ఐని అభినందించారు.

ఆగిరిపల్లి ఎస్ఐగా శుభశేఖర్

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ఎస్ఐగా కె.శుభశేఖర్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న సురేంద్ర కుమార్‌ను వీఆర్‌కు పంపుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

నందిగామ టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి ఆదేశించారు. కంచల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు.